క్లుప్తంగా

పట్టుపరిశ్రమ డీడీకి సత్కారం



నంద్యాల పట్టు పరిశ్రమ శాఖ డీడీ పరమేశ్వరిని సత్కరిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలులో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేసి, జిల్లా విభజన అనంతరం పూర్తి అదనపు బాధ్యతలతో పట్టు పరిశ్రమ శాఖ అధికారిగా సేవలందించిన జి. పరమేశ్వరిని ఆ శాఖ సిబ్బంది ఘనంగా సత్కరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని జిల్లా పట్టు పరిశ్రమ శాఖ కార్యాలయంలో అధికారి విజయకుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నంద్యాల జిల్లా పట్టు పరిశ్రమ శాఖ డీడీని ఘనంగా సన్మానించారు. అధికారి విజయకుమార్ మాట్లాడుతూ డీడీ పరమేశ్వరి సేవలను కొనియాడారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనుమతిలేని ల్యాబ్‌లపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): నగరంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ల్యాబోరేటరీలపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డిలకు ఏఐవైఎఫ్ నాయకులు మంగళవారం వేర్వేరుగా వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ.. ఎలాంటి నిబంధనలు పాటించకుండా విచ్చలవిడిగా ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నారని, వ్యాధినిర్ధారణ పరీక్షలకు ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోనూ పలువురు ప్రైవేటు ల్యాబ్‌ల నిర్వాహకులు చేరి రోగుల నుంచి శ్యాంపిల్స్ తీసుకెళ్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో నాయకులు శ్రీనివాసులు, బీసన్న, నాయకులు రాజు, హుసేన్‌బాషా, శరత్ ఉన్నారు.

ప్రభుత్వ వైద్యుల అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు



అడ్‌హాక్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): తమ సమస్యల పరిష్కారం కోసం, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు గాను ప్రభుత్వ వైద్యులు అడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ మేరకు మంగళవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వారు సమావేశమై కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.కమిటీ కన్వీనర్లుగా డాక్టర్ రామశివనాయక్, డాక్టర్ బ్రహ్మాజీ మాస్టార్, సభ్యులుగా డాక్టర్ సునీల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ విజయానందబాబు, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ మాధవీశ్యామల, డాక్టర్ రామకృష్ణనాయక్, డాక్టర్ సోమప్ప, డాక్టర్ శారద, డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ సలీంబాషా ఎన్నికయ్యారు.

పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టండి



పారిశుద్ధ్యంపై సూచనలు చేస్తున్న డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీ.రమాదేవి

కర్నూలు (టౌన్): ఫిర్యాదులు వస్తున్నాయి.. పారిశుద్ధ్యంపై మరింత దృష్టి పెట్టాలని నగర పాలక డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీ.రమాదేవి సూచించారు. స్థానిక బి.క్యాంపులో మురుగు కాల్వలు బ్లాక్ అయ్యాయన్న ఫిర్యాదుల మేరకు ఆమె మంగళవారం శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజుతో కలిసి వెళ్లి పరిశీలించారు. సమస్యను శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ వెల్ఫేర్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి రోజు వెల్ఫేర్ సిబ్బంది ఆయా సచివాలయాల పరిధిలో శానిటేషన్‌పై దృష్టి పెట్టాలన్నారు. మురుగు కాల్వలు ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయించాలని ఆదేశించారు. అలాగే ట్రేడ్ లైసెన్సులు, యూజర్‌చార్జీల గురించి ఆరా తీశారు. పెండింగ్ బకాయిలు వసూలు చేయాలని సూచించారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్ : కిసీ కా భాయ్ కిసీ కా జాన్, విరుపాక్షి, దసరా, ఇవిల్‌డెడ్ రైజ్, శాకుంతలం, రావణాసుర
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : కిసీ కా భాయ్ కిసీ కా జాన్, విరుపాక్షి, దసరా, ఇవిల్‌డెడ్ రైజ్, విడుదల పార్ట్–1, రుద్రుడు, శాకుంతలం
వెంకటేష్ సినీ కాంప్లెక్స్: విరుపాక్షి, విడుదల పార్ట్–1, రుద్రుడు
ఐనాక్స్: కిసీ కా భాయ్ కిసీ కా జాన్, ఇవిల్‌డెడ్ రైజ్, సుజుమె, విడుదల పార్ట్–1, ది సూపర్ మారియో బ్రదర్స్, హలో మీరా,రావణాసుర
భరత్ కాంప్లెక్స్ : కిసీ కా భాయ్ కిసీ కా జాన్, బలగం, దసరా
శ్రీరామ : విరుపాక్షి
రాజ్ : విరుపాక్షి
విజయ : కిసీ కా భాయ్ కిసీ కా జాన్

సదా మీ సేవలో..

- అన్నార్థులకు అన్నదానం, అవసరార్థులకు రక్తదానం
- ఎన్‌ఎస్‌ఎస్‌లో చేసిన సేవలే ప్రేరణ
- కోవిడ్ సమయంలో రెండు లక్షల మందికి ఆహార ప్యాకెట్ల పంపిణీ
- 15 వేల మందికి రక్తదానం



అన్నార్థుల ఆకలి తీరుస్తూ...

కర్నూలు(హాస్పిటల్): ఎన్‌సీసీ అతనికి క్రమశిక్షణ నేర్పింది. ఎన్ఎస్ఎస్ సేవాగుణాన్ని అలవరిచింది. కుటుంబసభ్యులు, స్నేహితుల ప్రోత్సాహం మానవత్వాన్ని మరింత రాటుదేల్చింది. ఫలితంగా పేదలు, అన్నార్థులు, అవసరార్థులు కనిపిస్తే చాలు సాయం చేయాలని అతని చేతులు ముందుకు సాగుతాయి. తన స్థాయి కాదని తెలిసినా ఉన్నంతలోనే నిత్యం సాయం చేస్తూ ఓ యువకుడు ఆదర్శంగా నిలుస్తున్నాడు.

కర్నూలు పెద్దమార్కెట్ సమీపంలోని రంగారెడ్డి గేట్‌కు చెందిన డి.నిఖిల్‌గౌడ్ ఎంబీఏ పూర్తి చేసి ప్రస్తుతం ఎల్‌ఎల్‌బీ చదువుతున్నాడు. అతని తండ్రి డి.పుల్లయ్యగౌడ్ పెయింటర్‌గా పనిచేస్తున్నారు. తల్లి రమాదేవి గృహిణి. తమ్ముడు అఖిల్ డిగ్రీ పూర్తి చేసి మార్కెటింగ్ జాబ్ చేస్తున్నాడు. నిఖిల్‌గౌడ్ పాఠశాల విద్యలో ఎన్‌సీసీలో చేరాడు. డిగ్రీలో సీనియర్ అండర్ ఆఫీసర్‌గా పనిచేశాడు. ఈ క్రమంలో రెండు నేషనల్, ఒక ఆలిండియా క్యాంపుల్లో పాల్గొన్నాడు. ఎన్ఎస్ఎస్‌లో తనకు అధ్యాపకుడు మండి అన్వర్‌హుసేన్ గురువుగా పేర్కొంటాడు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌లో ఉన్న సమయంలో స్నేహితులు, తెలిసిన వారందరితో రక్తదాన కార్యక్రమాలు విరివిగా నిర్వహించాడు. అతనే ఇప్పటివరకు స్వయంగా 27 సార్లు రక్తదానం, 12 సార్లు రక్త కణాల దానం చేశాడు.

కోవిడ్ సమయంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు

కోవిడ్ సమయంలో 2020లో అప్పటి జిల్లా ఎస్పీ సహకారంతో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అప్పట్లో నిరాశ్రయులు, రహదారులపై ఉన్న వారికి 2 లక్షల ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. మరో 1,283 మందికి కూరగాయల కిట్లు అందజేశాడు. ఇవన్నీ తన స్నేహితులు, తన సొంత డబ్బుతో నిర్వహించినట్లు నిఖిల్ పేర్కొంటాడు. దీంతో పాటు రక్తదానాలు, ఆహార ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాలు ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు 15 వేల మంది అవసరార్థులకు రక్తదానం చేయించాడు. ఇటీవల మహాశివరాత్రి, ఉగాది పండుగల సందర్భంగా శ్రీశైలం వెళ్లే భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎక్కడైనా ఫంక్షన్‌లలో ఆహారం మిగిలిందని తెలియగానే అక్కడికి వెళ్లి ఆహారాన్ని సేకరించి, వాటిని పొట్లాలుగా కట్టి ఆకలిగొన్న వారికి పంచి పెడుతున్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గత సంవత్సరం 555 అడుగుల జాతీయ పతాకంతో కర్నూలు నగర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.



పేద పిల్లలతో నిఖిల్‌గౌడ్



స్వాతంత్య్ర దినోత్సవం రోజున 555 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ

కుటుంబసభ్యులు, స్నేహితుల ప్రోత్సాహంతోనే..

నాకు బాల్యంలో పేదరికం అంటే ఏమిటో తెలిసొచ్చింది. పేదరికాన్ని కళ్లారా చూశాను. ఆకలి బాధ తెలుసు కాబట్టి ఏ ఒక్కరూ ఆకలితో ఉండకూడదని భావిస్తాను. నాకు చేతనైనంత వరకు సాయం చేయాలని నిర్ణయించుకున్నాను. ఇందుకు కుటుంబసభ్యులు, స్నేహితుల నుంచి మంచి ప్రోత్సాహం లభించింది. హాకీ క్రీడాకారుడు సుధీర్‌కుమార్ నుంచి క్రమశిక్షణ నేర్చుకున్నాను. సేవా కార్యక్రమాలకు కర్నూలు డీఎస్పీ కేవీ మహేష్ వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నారు.

– నిఖిల్‌గౌడ్, కర్నూలు

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

కర్నూలు సిటీ: రవీంద్ర మహిళా ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వెంకాయపల్లెలో స్పెషల్ క్యాంపు నిర్వహించారు. ఏడు రోజుల పాటు నిర్వహించిన క్యాంపు మంగళవారంతో ముగిసింది. కార్యక్రమంలో భాగంగా ఏడు రోజులు వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు.

మైపర్ కాలేజీ వార్షికోత్సవం



మాట్లాడుతున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

కర్నూలు(సిటీ): మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీ రెండో వార్షికోత్సవం ఎ.క్యాంప్‌లోని ఆ కాలేజీ ప్రాంగణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఆయన మాట్లాడుతూ.. వైద్యరంగంలో కీలకపాత్ర ఫార్మసిస్టులదే అన్నారు. విద్యార్థులు ఫార్మసీ రంగంలో సరికొత్త ఆలోచనలతో పరిశోధనలు చేయాలన్నారు. కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ స్టెల్లా సతీష్ ప్రసంగించారు. వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి, అకడమిక్ పరీక్షల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రూ.1.30 కోట్ల పన్ను బకాయిల చెల్లింపు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థకు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను బకాయిలను మంగళవారం అగ్రికల్చర్ మార్కెట్ యార్డు కమిటీ చెల్లించింది. స్థానిక మార్కెట్ యార్డులో చైర్మన్ యస్.ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి కే.గోవింద్ మార్కెట్ యార్డు ఆస్తి పన్ను బకాయిలు రూ.1,30,75,000 మొత్తాన్ని రెవెన్యూ ఆధికారులకు అందజేశారు. వారు మాట్లాడుతూ.. కర్నూలు అగ్రికల్చర్ మార్కెట్ యార్డు 2019 నుంచి 2023–2024 ఆర్థిక సంవత్సరం వరకు బకాయిలను కమిటీ సహకారంతో నగరపాలక సంస్థకు చెల్లించినట్లు చెప్పారు. పెద్ద మొత్తంలో ఆస్తి పన్ను బకాయిలు చెల్లించడంతో రెవెన్యూ అధికారి జునీద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాధిక్ హుస్సేన్ ధన్యవాదాలు తెలిపారు.



ఆస్తి పన్ను బకాయిల మొత్తం అందజేస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్ యస్.ప్రభాకర్‌రెడ్డి

మెరుగైన వైద్యసేవలందించండి

కర్నూలు(హాస్పిటల్): గ్రామీణ, పట్టణ ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య ఆదేశించారు.ఆయన మంగళవారం తనఛాంబర్‌లో జిల్లా ప్రోగ్రాంఅధికారులతో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. పీహెచ్‌సీలు, పట్టణ పీహెచ్‌సీలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను సందర్శించి అన్ని జాతీ య ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిని సమీక్షించాలని ఆదేశించారు. మెడికల్ ఆఫీసర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం యాప్‌లలో ఆరోగ్య సేవల వివరాలను నమోదు చేయాలని, ఎప్పటికప్పుడు తగు సూచనలు చేస్తూ పర్యవేక్షణ చేయాలన్నారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఐరన్ మాత్రలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వైద్యాధికారు లు వారి పరిధిలోని హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య సేవలు అందించాలని, గర్భవతులు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి రక్తహీనత కలిగిన వారికి తగిన చికిత్స అందించి, వివరాలను అనీమియా మానిటరింగ్ టూల్‌లో పొందుపరచాలని సూచించారు. డీటీసీఓ డాక్టర్ భా స్కర్, జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్,ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సత్యవతి, డీపీఎంఓ డాక్టర్ ఉమ, ఆర్‌బీఎస్‌కే కో–ఆర్డినేటర్ హేమలత, ఎఫ్‌పీసీ నోడల్ అధికారి డాక్టర్ బాలమురళీకృష్ణ, మలేరియా అధికారి నూకరాజు, డీపీహెచ్ఎన్ఓ ఇందిర,ఎస్ఓ హేమసుందర్, డీపీఓ విజయరాజు,డెమో శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య

అరుదైన జబ్బుతో నిత్య నరకం

- యువకునికి అరుదైన నరాల జబ్బు
- నడకలో తడబాటు, తూలిపాట్లు
- కండరాలు, నరాలు బలహీనం
- జన్యు కారణాలతో సమస్య

కర్నూలు(హాస్పిటల్): ఆ యువకుడు నడిస్తే తూలిపడినట్లుంటాది. మెట్లెక్కేటప్పుడు ఒక్కోసారి కిందపడిపోతుంటాడు. తిన్నగా ఒకే వరుసలో నడవటం చేతకాదు. అందరు యువకుల్లా ఆటలాడలేడు. ఈ వింతైన వ్యాధి పేరు ఫ్రెడ్రిక్ అటాక్సియా అని వైద్యులు నిర్ధారించారు. రెండు లక్షల మందిలో ఒకరికి మాత్రమే ఇలాంటి వ్యాధి వస్తుందట. మన దేశంలో మందులు లేని ఈ వ్యాధికి లక్షణాల మేరకు మాత్రమే చికిత్స అందిస్తున్నారు.

జిల్లాలోని ఆదోని ప్రాంతానికి చెందిన ఓ యువకుడికి ఈ అరుదైన జబ్బు బయటపడింది. వివరాలను మంగళవారం స్థానిక కర్నూలు హార్ట్ అండ్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో న్యూరాలజిస్టు డాక్టర్ కె.హేమంత్‌కుమార్ వివరించారు. ఆదోనికి చెందిన 22 ఏళ్ల యువకునికి ఏడేళ్ల నుంచి నడకలో ఇబ్బంది ఏర్పడింది. కుటుంబసభ్యులు అతన్ని పలువురు వైద్యుల వద్ద చూపినా ఫలితం లేకుండా పోయింది. తన వద్దకు వచ్చిన ఆ యువకునికి ఎంఆర్ఐ పరీక్ష చేయించడంతో పాటు జెనటిక్ టెస్ట్ నిర్వహించడంతో అతనికి అత్యంత అరుదైన ఫ్రెడ్రిక్ అటాక్సియా అనే వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. దీనికి మన దేశంలో ఎలాంటి మందులు లేవు. కేవలం వ్యాధి లక్షణాలను బట్టి సపోర్టివ్ మెడిసిన్స్ మాత్రమే ఇచ్చి చికిత్స చేస్తున్నారు. దీనివల్ల వ్యాధి తీవ్రత పెరగకుండా ఉంటుందని డాక్టర్ హేమంత కుమార్ చెప్పారు. ఇది జెనటిక్, మేనరికపు వివాహాల కారణంగా వస్తుందని తెలిపారు. కొన్నిసార్లు విటమిన్–ఇ, బి12 లోపం వల్ల, సెరిబెల్లమ్‌లో కణితి ఉండటం వల్ల, వెన్నుపూసలో సమస్య కారణంగా వస్తుందన్నారు. ఐదేళ్ల పిల్లాడి వరకు ఎలాంటి లక్షణాలు బయటపడవని, 10 నుంచి 15 ఏళ్ల వయస్సులో వ్యాధి తీవ్రమవుతుందన్నారు. ఎఫ్.ఎక్స్.ఎన్ జీన్ మ్యూటేషన్ చెందడం వల్ల ఈ వ్యాధి వస్తుందన్నారు. దీనికి చికిత్స లేదని, గత ఫిబ్రవరిలో ఒమవెలోక్సోలోన్ 150 ఎంజీ అనే మందుకు ఎఫ్‌డీఐ అనుమతి ఇచ్చిందని, ఇది ఇంకా మన దేశంలోకి రాలేదన్నారు. ప్రస్తుతానికి ఫిజియోథెరపీ చికిత్స, సపోర్టివ్ డ్రగ్స్ ఇవ్వడం ద్వారా వ్యాధితీవ్రతను తగ్గించవచ్చని ఆయన పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో రామానుజాచార్యుల జయంతి

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులంలో సోమవారం భగవద్రామానుజాచార్యుల 1006వ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి నవ కలశస్నపన, శంఖధార, సహస్రధారలతో స్వామివారికి తిరుమంజనం, చందనోత్సవం, పల్లకీ సేవతోపాటు వివిధ కైంకర్యాలు నిర్వహించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద సంస్కృత పాఠశాల, విజ్ఞాన పీఠం, అన్నపూర్ణమ్మ ఆవాస కేంద్రం విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లను సుమారు 400 మంది విద్యార్థులకు అందజేశారు. అన్నదాన ప్రసాద వితరణ చేశారు. శంకర మందిర వదే పాఠశాల విద్యార్థులకు వస్త్ర సమర్పణ చేశారు. గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజు గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, సభ్యులు, టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సంకల్‌భాగ్ హరహర క్షేత్రంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి, భవాని సమేత శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం శంకర జయంతిని ఘనంగా నిర్వహించారు. పూజ్య ఆదిగురువు శంకరాచార్యుల స్వామి వారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, విశేష పూజలు జరిగాయి. సంఘం అధ్యక్షులు కల్లె చంద్రశేఖర శర్మ, సభ్యులు ప్రసన్నకుమార్, సాయికుమార్, గురు రాజారావు, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



రామానుజాచార్యుల చిత్రపటాన్ని ఊరేగిస్తున్న గోదాగోకులం సభ్యులు

బీజేపీని గద్దె దింపాలి

కర్నూలు(సెంట్రల్): బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని వామపక్షాలు పిలుపునిచ్చాయి. మంగళవారం సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో పాత కల్లూరులోని చెంచు నగర్, ఊరివాకిలి, కురువ గేరి, ఇందిరమ్మ కట్టచ, జానకీ నగర్, మహాత్మ కాలనీలలో ప్రచార భేరీ కొనసాగింది. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పీఎస్ రాధాకృష్ణ, సీపీఐ నగర సహాయ కార్యదర్శి డి.శ్రీనివాస రావు మాట్లాడుతూ.. దేశాన్ని బీజేపీ విచ్ఛిన్నం చేసే కుట్ర చేస్తోందని మండిపడ్డారు.

గడప గడపకూ సంక్షేమ లబ్ధి

కల్లూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి గడపకూ లబ్ధి చేకూరిందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరు 27వ వార్డు 68, 69వ వార్డు సచివాలయాల పరిధిలోని కృష్ణానగర్, ఆదిత్య నగర్, అబ్బాస్ నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయా కాలనీలో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ సంక్షేమ క్యాలెండర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కరోనా ప్రభావంతో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు బాగాలేకున్న ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రజా సమస్యలను అక్కడికక్కడే పరిష్కారిస్తున్నామన్నారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు తేడాను ప్రజలు గమనించాలన్నారు. ఆయా కాలనీవాసులు డ్రైనేజీ, కల్వర్టుల సమస్యలను తెలియజేయగా సకాలంలో పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. డిప్యూటీ మేయర్ రేణుక, స్థానిక కార్పొరేటర్ పల్లె శారద, పలువురు కార్పొరేటర్లు, నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సిద్దు, వెంకటరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కె.వి.రమణారెడ్డి, పెద్దన్న, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

అధిక దిగుబడుల సాధనకు కృషి చేయండి

కర్నూలు(అగ్రికల్చర్):తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించే విధంగా రైతులకు సాగులో మెలకువలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఆర్‌బీకేల ద్వారా రైతులకు అన్ని రకాల సేవలను అందుబాటులోకి తేవాలని సూచించారు. వ్యవసాయం, పశుసంవర్ధక శాఖ, మత్స్య శాఖ, ఏపీఎంఐపీ, పట్టు పరిశ్రమ శాఖల ద్వారా అమలవుతున్న పథకాల గురించి ఆరా తీశారు. అన్ని పథకాలను రైతుల్లోకి తీసుకెళ్లి సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలన్నారు. జిల్లాలో చిరుధాన్యాల సాగు, వినియోగాన్ని ప్రోత్సహించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఖరీఫ్‌లో సబ్సిడీపై విత్తనాల పంపిణీకి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. 2023–24లో సూక్ష్మ సేద్యాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలన్నారు. ఫిష్ ఆంధ్ర ద్వారా అన్ని రకాల చేపలను ప్రజలకు అందుబాటులోకి తేవాలని, లక్ష్యం మేరకు ఫిష్ వెండింగ్ యూనిట్లు నెలకొల్పాలని సూచించారు. పశు విజ్ఞాన బడులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కూరగాయలు, పండ్ల తోటల సాగు దిశగా రైతులకు ప్రోత్సహించాలన్నారు. డీఏఓ పీఎల్ వరలక్ష్మి, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, జిల్లా ఉద్యాన అధికారి రామాంజనేయులు, మత్స్యశాఖ అధికారి శ్యామల, పశుసంవర్ధక శాఖ జేడీ రామచంద్రయ్య, పట్టు పరిశ్రమ శాఖ అధికారి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న కలెక్టర్ జి.సృజన, హాజరైన అధికారులు

30న ఏపీజీఈఏ సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం దిశగా ఈ నెల 30న రాజమహేంద్రవరంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) విస్తృత సమావేశం నిర్వహిస్తోందని జిల్లా శాఖ అధ్యక్షుడు బంగి శ్రీధర్ తెలిపారు. ఆనం కళాక్షేత్రంలో జరిగే ఈ సమావేశానికి జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఉద్యోగులు తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. మంగళవారం ఏపీజీఈఏ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొత్త జిల్లాల ఏర్పాటు అనంతరం ఉద్యోగుల పదోన్నతులు, బదిలీలు, పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం, శాఖాపరమైన సంస్కరణలు తదితర వాటిపై రాష్ట్ర నాయకత్వం సమగ్రంగా చర్చించనుందని తెలిపారు. దీని ఆధారంగా భవిష్యత్ ప్రణాళికను సిద్ధం చేస్తామని పేర్కొన్నారు. జిల్లా సహా అధ్యక్షుడు సురేష్‌బాబు, ఉపాధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, నగర కార్యదర్శి చెన్నకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ సేద్యంపై అవగాహన

కర్నూలు(అగ్రికల్చర్): 2023–24లో జిల్లాలో అవసరమైన రైతులందరికీ సూక్ష్మ సేద్యం కల్పించడంలో భా గంగా ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లకు అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు ఏపీఎంఐపీ శ్రీకారం చుట్టింది. జిల్లాలో 466 ఆర్‌బీకేలు ఉండగా ఉద్యాన అధికారులు మండలాల వారీగా వీటి ఇన్‌చార్జ్‌లకు ఈ నెల 25 నుంచి మే 3వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ ఏడాది 5 వేల హెక్టార్లకు సూక్ష్మ సేద్య సదుపాయం కల్పించే విధంగా ప్రభుత్వం లక్ష్యాన్ని ఇచ్చింది. బిందు, తుంపర్ల సేద్యానికి ఆర్‌బీకేల్లో ఏ విధంగా రిజిస్ట్రేషన్ చేయాలి. డాక్యుమెంటేషన్ అప్‌లోడ్ చేయడం ఎలా, నీటి లభ్యత, పంటల స్వభావం. నేల స్వభావం, విద్యుత్ సౌకర్యాం తదితర వాటిని బట్టి డిజైన్ ఏ విధంగా చేయాలి. ప్రాథమిక సర్వే చేసే విధానం తదితర వాటిపై ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లకు అవగాహన కల్పించారు.

జిల్లా జ్యోతిష్యుడి ఘనత



సింగపూర్‌లో జ్యోతిష్య శాస్త్రవేత్తల సమ్మేళనంలో సన్మానం అందుకుంటున్న భానుప్రకాష్ శర్మ

కర్నూలు కల్చరల్: సింగపూర్‌లో ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు జరిగిన ప్రపంచ జ్యోతిష్య శాస్త్రవేత్తల సమ్మేళనంలో రాష్ట్రం నుంచి కర్నూలుకు చెందిన డాక్టర్ భానుప్రకాష్ శర్మ హాజరయ్యారు. నాలుగు రోజుల పాటు శాస్త్రవేత్తలు జ్యోతిష్య శాస్త్రంలో మార్పులపై చర్చించారు. ఈ సందర్భంగా టీజీవీ కళాక్షేత్రంలో కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, సభ్యులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. త్వరలో మరో అంతర్జాతీయ సమ్మేళనానికి హాజరు కానున్నట్లు భానుప్రకాష్ శర్మ పేర్కొన్నారు. కర్నూలు కొత్తపేట ఆంజనేయ స్వామి గుడిలో పూజారిగా ఉన్న భానుప్రకాష్ శర్మ జ్యోతిష్య శాస్త్రంలో ఎంఏతో పాటు డాక్టరేట్ డిగ్రీ పొందారు.

రెగ్యులర్ చేయాలి

కర్నూలు(సెంట్రల్): కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ వి.గిరికుమార్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. మంగళవారం ఏపీజేఏసీ అమరావతి ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగుల కోసం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలను ఆ సంస్థ జిల్లా చైర్మన్ గిరికుమార్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

సస్పెన్షన్లు ఎత్తివేయాలి

కర్నూలు సిటీ: పాఠశాల విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పర్యవేక్షణ పేరుతో వివిధ జిల్లాల్లో వివిధ కారణాలతో అధికారులను సస్పెండ్ చేయడం తగదని, వెంటనే ప్రభుత్వం స్పందించి సస్పెన్షన్లను ఎత్తివేయాలని ఫ్యాప్టో జిల్లా చైర్మెన్ ఎస్.గోకారి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మూల్యాంకనం క్యాంపు వద్ద ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు.

శుభ్రతతోనే మలేరియా నివారణ

కర్నూలు(హాస్పిటల్): పరిసరాల పరిశుభ్రతతో మలేరియా వ్యాధిని నివారించవచ్చని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డ య్య అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం స్థానిక డాక్టర్స్ కాలనీలోని రాయలసీమ నర్సింగ్ కాలేజీలో మలేరియా నివారణ విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించా రు. ఈ సందర్భంగా డీహెచ్‌ఎంఓ మాట్లాడుతూ.. చలి జ్వరం, తలనొప్పి ఉంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రాత్రి నిద్రించేటప్పుడు దోమతెరలు వాడాలన్నారు. దోమలు ఉత్పత్తి అయ్యే ప్రాంతాలను గుర్తించి యాంటి లార్వా ఆపరేషన్ చ ర్యలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ ఎల్.భాస్కర్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి, మలేరియా అధికారి నూకరాజు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధవి, డెమో శ్రీనివాసులు, బయాలజిస్టు వెంకటేశ్వర్లు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు, నర్సింగ్ కాలేజీ విద్యార్థినులు పాల్గొన్నారు.